# ఉమ్మడి ప్రయోజనాలకు గొడుగు!

## ఆశలు రేకెత్తిస్తున్న 'బ్రిక్స్' బ్యాంకు



బ్రెట్టన్‌ఉడ్ కవలలుగా ప్రసిద్ధి చెందిన 'ప్రపంచ బ్యాంకు' , 'అంతర్జాతీయ ద్రవ్యనిధి' సంస్థల్లో మరిన్ని ఓటింగ్ హక్కుల కోసం అమెరికా, ఐరోపాలతో నిరంతరం ఘర్షణ పడి, విఫలమైన దేశాలు ఇప్పుడు తమ సొంత బ్యాంకుతో ముందుకువస్తున్నాయి. తమకు హక్కులు కావాలంటూ ప్రధానంగా బ్రెజిల్, రష్యా, భారత్, చైనా దేశాలు అనేక సార్లు జి-20 కూటమి సమావేశాల్లో తమ నిరసన గళం వినిపించాయి. ప్రపంచ బ్యాంకు. ఐఎంఎఫ్‌ల్లో మరింత వాటాకోసం అవి చేసిన డిమాండులను అమెరికా, ఐరోపాలు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ వచ్చాయి. కొంచెం వాటా విదిల్చినా అది చైనా, జర్మనీలకే పరిమితమైంది. అందుకే ఇప్పుడు 100 బిలియన్ డాలర్ల తాత్కాలిక నిధితో 'బ్రిక్స్ అభివృద్ధి బ్యాంకు' ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు ఆసక్తికరంగా మారాయి.

### ధనిక దేశాల పెత్తనం

ప్రపంచ వాణిజ్య వ్యవహారాల్లో అమెరికా, ఐరోపాల ఆధిపత్యం పరాకాష్ఠకు చేరడం వర్ధమాన దేశాల్లో అసంతృప్తికి కారణమైంది. 'ప్రపంచ వాణిజ్య సంస్థ' వేదికగా జరిగిన 'దోహా రౌండ్' చర్చల్లో వర్ధమాన దేశాలు వ్యవసాయ రంగంలో వాణిజ్యానికి సంబంధించి ఒక్కటవడం అమెరికా, ఐరోపాలు అంగీకరించలేకపోయాయి. 'దోహా రౌండ్' చర్చల సారాంశాన్ని గుర్తించడానికే అవి నిరాకరించాయి. ఈ పరిణామాలు వర్ధమాన దేశాలు ఒక్కటయ్యేలా చేసి, 'బ్రిక్స్ అభివృద్ధి బ్యాంకు' ఏర్పాటు దిశగా అడుగులు వేసేలా చేశాయి.


ధనిక దేశాలు 1990 దశకం ప్రారంభంలో 'డంకెల్ ముసాయిదా'ను ఆమోదింపజేసుకోవడం ద్వారా ఇతర దేశాలపై తమ పెత్తనానికి శ్రీకారం చుట్టాయి. అమెరికా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర ధనిక దేశాలు(కొన్ని మినహాయింపులతో స్థూలంగా ఓఈసీడీ) 'ఉరుగ్వే రౌండ్' చర్చల ద్వారా 'ఆమోదించు లేదా తిరస్కరించు' అంటూ గొంతు మీద కత్తి పెట్టి ముసాయిదాను ఇతర దేశాలతో ఆమోదింపజేసుకున్నాయి. దరిమిలా కొత్త 'గాట్' ఒప్పందం రూపొందింది. అది 'ప్రపంచ వాణిజ్య సంస్థ'గా అవతరించింది. తరవాత వాణిజ్య చర్చలు 'దోహా రౌండ్'లోకి ప్రవేశించాయి. ఇక్కడ చైనా, బ్రెజిల్, ఇండియా, మలేసియా, రష్యాల నేతృత్వంలో వర్ధమాన దేశాలు ఒక్కటయ్యాయి. వ్యవసాయ రంగంలో అమెరికా, ఐరోపా దేశాలు తమ కంపెనీలకు ఇస్తున్న భారీ సబ్సిడీలను రద్దు చేయాలని పట్టుపట్టడంతో అసలు 'దోహా రౌండ్' చర్చలకే అవి స్వస్తి పలికాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో తమ మిత్రదేశాలకు అమెరికా, ఈయూ(యూరోపియన్ యూనియన్)లు ఇవ్వజూపిన 'అత్యంత ప్రాధాన్య దేశ హోదా'ను ఇండియా, చైనా తదితర మూడో ప్రపంచ దేశాలకు ఇవ్వడానికి నిరాకరించడమూ 'దోహా రౌండ్' చర్చల వైఫల్యానికి మరో కారణం. 'ట్రిప్స్ అండ్ ట్రిమ్స్' ఒప్పందాలతో పెట్టుబడి, మేధోసంపత్తి రంగాల్లో అమెరికా, ఈయూ, జపాన్‌లు తమ ఆధిపత్యాన్ని ఖాయం చేసుకున్నాయి. దక్షిణార్ధ గోళంలోని వర్ధమాన దేశాల డిమాండ్లకు స్వస్తి పలికితే తప్ప చర్చలకు రామని అవి మొరాయించాయి. తద్వారా సమాన వాణిజ్య అవకాశాల ప్రతిపాదనలకు తామెంత వ్యతిరేకమో అమెరికా తదితర ధనిక దేశాలు స్పష్టంగా చాటుకున్నాయి.

### వర్ధమాన దేశాలపై కన్ను

ఈ పరిస్థితుల్లో వర్ధమాన దేశాల అసంతృప్తులను చల్లార్చడానికా అన్నట్లు అమెరికా, ఈయూలు జి-20 గ్రూపును ముందుకు తెచ్చాయి. 1999లో ఏడు ధనిక దేశాల కూటమి జి-7 చొరవతో ఏర్పడిన జి-20, 2008 వరకు నామమాత్ర సమావేశాలతో సరిపుచ్చింది. 2008నాటి 'ప్రపంచ ఆర్థిక సంక్షోభం' దరిమిలా అమెరికా, ఈయూ తీవ్ర ఆర్థిక మాంద్యం ఎదుర్కొన్నాయి. జీడీపీ వృద్ధి అటుంచి ప్రతికూల వృద్ధి నమోదయ్యే దుస్థితి దాపురించింది. ఆర్థిక వనరుల కోసం, ముఖ్యంగా ద్రవ్య వనరుల కోసం అవి అంగలార్చిన పరిస్థితుల్లో జి-20 కూటమి దేశాలు వరస సమావేశాలు నిర్వహించాయి. చైనా, బ్రెజిల్, భారత్ దేశాల్లోగల వాణిజ్య అవకాశాలపై అవి ప్రధానంగా కన్నేశాయి. అప్పట్లో చైనావద్ద మూడు లక్షలకోట్ల డాలర్లకు పైగా వాణిజ్య మిగులు రూపంలో విదేశ మారక ద్రవ్య నిల్వలు ఉన్నాయి. మూడు నాలుగు దశాబ్దాలపాటు ప్రభుత్వరంగ పరిశ్రమల కృషివల్ల చైనా, ఇండియా, రష్యాల్లో ఎగువ, సంపన్న, మధ్యతరగతి వర్గాలు కొత్తగా ఆవిర్భవించాయి. బ్రెజిల్‌లో వాణిజ్య అవకాశాలు పెరిగాయి. ఆయా దేశాల్లో కనబడుతున్న కొత్త అవకాశాలు అమెరికా, ఈయూలను ఊరించడమే జి-20 గ్రూపు వరస సమావేశాలకుగల కారణం. దీన్నిబట్టి వాల్‌స్ట్రీట్ బ్యాంకింగ్ దిగ్గజం, 'గోల్డ్ మ్యాన్ సాచ్స్' ఆర్థికవేత్త జిమ్ ఒనీల్ మొదటిసారి 'బ్రిక్స్' పదబంధాన్ని ప్రయోగించడం యాదృచ్ఛికం కాదని బోధపడుతోంది.

### ఆచరణకు నోచుకోని హామీలు

వరస సమావేశాల్లో వర్ధమాన దేశాలపై ధనిక దేశాలు అనేక వాగ్దానాలు కురిపించాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులను సంస్కరించి వర్ధమాన దేశాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామన్నాయి. నల్లడబ్బుకు సర్గధామంగా మారిన స్విస్ బ్యాంకు లాంటివాటిల్లో పారదర్శకత తెస్తామన్నాయి. ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి వాల్‌స్ట్రీట్ కంపెనీల అక్రమ లావాదేవీల విధానాలు, సబ్ ప్రైమ్ హౌసింగ్ రుణాలే కారణమని ఆరోపణలు వెల్లువెత్తాయి. దరిమిలా ఆ కంపెనీలను విడగొట్టి బలహీనపరుస్తామన్నాయి. ఆచరణలో ఇవేవీ ఆచరణ రూపంలోకి రానేలేదు. తమ ద్రవ్య, మార్కెట్ వనరులకే ధనిక దేశాలు ఎసరు తెస్తున్నాయని గుర్తించిన వర్ధమాన దేశాలు అందుకు ఆస్కారం ఇవ్వకుండా తమను తాము కాపాడుకున్నాయి. దానితో జి-20 సమావేశాలు మళ్ళీ కంటితుడుపు సమావేశాలుగా మిగిలాయి. ఈ నేపథ్యంలో జిమ్ ఒనీల్ అందించిన ఆలోచనను అందిపుచ్చుకొని తమ కలల సాకారానికి 'బ్రిక్స్' దేశాలు శ్రీకారం చుట్టాయి.




### సొంత లాభం కోసమే!

ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు కేవలం రెండో ప్రపంచ యుద్ధంలో చితికిపోయిన పెట్టుబడిదారీ పారిశ్రామిక దేశాల కోసమే పుట్టాయి. తరవాత మౌలిక నిర్మాణాల కోసం అప్పులు ఇచ్చే పేరుతో ప్రపంచ బ్యాంకు, 'వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమం' పేరుతో ఐఎంఎఫ్ అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లను తమ వశం చేసుకునేందుకు నడుం బిగించాయి. అంటే, ప్రపంచ విపణులను అమెరికా, ఈయూల పాదాక్రాంతం చేయడమే బ్రెట్టన్‌ఉడ్ కవలల అసలు ఉద్దేశం. అందుకనే అవి వర్ధమాన దేశాల ఆర్థిక శక్తికి తగిన ప్రాధాన్యం ఇవ్వడానికి తిరస్కరించాయి. కనుక బ్రిక్స్ అభివృద్ధి బ్యాంకు, ప్రపంచ బ్యాంకుకు పోటీ కాదని 'బ్రిక్స్' దేశాలు చెబుతున్నప్పటికీ ఆచరణలో పోటీ అనివార్యమే. నిరుడు వివిధ దేశాలకు ప్రపంచ బ్యాంకు ఇచ్చిన రుణాల కన్నా, ఒక్క చైనా ఇచ్చిన అప్పులే ఎక్కువన్న సంగతి గ్రహిస్తే పోటీ ఎందుకు అనివార్యమో అర్థమవుతుంది.

చైనా ఆర్థిక శక్తి 'బ్రిక్స్' కూటమిలోని ఇతర సభ్యులను కలవరపెడుతోందంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదని ఇటీవలి పరిణామాలు చాటుతున్నాయి. బ్రెట్టన్‌ఉడ్ సంస్థల్లో అమెరికా, ఈయూ; ఆసియా అభివృద్ధి బ్యాంకులో జపాన్‌దే ఆధిపత్యం. అలాగే బ్రిక్స్ అభివృద్ధి బ్యాంకులో చైనా ఆధిపత్యం చలాయిస్తుందన్న భయానుమానాలు 'బ్రిక్స్'లోని ఇతర సభ్యదేశాలకు ఉన్నాయంటూ పాశ్చాత్య దేశాలు ప్రచారం చేశాయి. ఇలాంటి అనుమానాలు అనవసరమని చైనా ప్రభుత్వం స్పష్టంచేసింది. డర్బన్ సమావేశాల్లో సైతం చైనా ప్రతినిధులు ఈ అనుమానాలను కొట్టిపారేశారు. తరవాతే 100 బిలియన్ డాలర్లతో బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్లు 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశం ప్రకటించింది. మూలధనం విషయమై సమగ్ర చర్చల తరవాత వచ్చే సంవత్సరం మార్చినాటికి అంతిమ నిర్ణయం ప్రకటిస్తారు. నిరుడు ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో బ్రిక్స్ అభివృద్ధి బ్యాంకు ఏర్పాటును ప్రతిపాదించింది మనదేశమే కావడంతో భారత బృందం తాజా పరిణామాలపట్ల మరింత ఆనందంతో ఉంది.

మూలధనంలో చైనా వాటా 41 బిలియన్ డాలర్లు. ఇండియా, రష్యా, బ్రెజిల్‌లు తలా 18 బిలియన్ డాలర్లు సమకూరుస్తున్నాయి. మిగిలిన అయిదు బిలియన్ డాలర్లు దక్షిణాఫ్రికా ఇస్తోంది. చైనా ప్రధాన వాటా పెట్టడంలో ఇతర సభ్య దేశాలకు అభ్యంతరం లేదని దీన్నిబట్టి స్పష్టమవుతూనే ఉంది. బ్రిక్స్ అభివృద్ధి బ్యాంకు ఏర్పాటుచేయాలన్న భారత ప్రతిపాదనకు గట్టిగా వత్తాసు పలికిందీ చైనాయే. ఇదే సహకారం చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు సమస్యల పరిష్కారం విషయంలోనూ కొనసాగితే 'బ్రిక్స్' కూటమి ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై కీలక స్థానంలో నిలవడం ఖాయం. బ్రిక్స్ అభివృద్ధి బ్యాంకుతో కలిసి పనిచేయడానికి సిద్ధమేనంటూ ప్రపంచ బ్యాంకు చేసిన ప్రకటన భవిష్యత్ పరిణామాలకు సూచిక!

### భారత్, చైనాల సహకారం

ఆర్థిక అంశాలకే పరిమితం కాకుండా తమ సహకారాన్ని రాజకీయ రంగంలోకీ విస్తరిస్తామని 'బ్రిక్స్' దేశాలు ఇప్పటికే ప్రకటించాయి. తమ దేశంలో తిరుగుబాటును ఎగదోస్తున్న అరబ్‌లీగ్, పశ్చిమ దేశాల ప్రయత్నాలను తిప్పికొట్టడానికి సహాయం చేయాలని సిరియా ఇప్పటికే 'బ్రిక్స్' దేశాలను కోరాయి. చైనా ప్రయోజనాలకు విఘాతం కలిగించే పరిణామాలు సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో చోటు చేసుకుంటున్నాయి. మాలీ ద్వీపంలో తిరుగుబాట్ల రూపంలో సంక్షోభం తలెత్తింది. ఇలాంటి అంతర్జాతీయ సమస్యల పరిష్కారంపైనా 'బ్రిక్స్' దేశాలు దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఐరోపా దేశాలు రుణసంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. యుద్ధాల భారం అగ్రదేశం అమెరికాను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. ఈ నేపథ్యంలో ఒకనాటి ధనిక దేశాలు ప్రపంచ ఆర్థికరంగంలో వస్తున్న మార్పులను, 'బ్రిక్స్' కూటమి శక్తిని అవి గుర్తిస్తున్నాయి. అందుకే, బ్రిక్స్ అభివృద్ధి బ్యాంకు ఆవిర్భావం- అంతర్జాతీయ ఆర్థిక చిత్రంలో రాబోయే మార్పులకు తిరుగులేని సంకేతం!

– విజయశేఖర్